క్లుప్తంగా

కౌంటింగ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లను పక్కాగా చేపడుతున్నామని కమిషనర్, నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కౌంటింగ్ నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నెల్లూరులోని కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుందన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. 8.30 గంటల నుంచి ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ ఓట్లను కార్పొరేషన్ కార్యాలయం స్ట్రాంగ్ రూమ్ నుంచి భద్రత సిబ్బంది ఆధ్వర్యంలో జూన్ 3వ తేదీన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రియదర్శిని కళాశాల కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామన్నారు. అభ్యర్థులు ఏజెంట్లను నియమించుకుని, కౌంటింగ్ ప్రక్రియపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఏజెంట్లు ఐడీ కార్డులను తప్పనిసరిగా పొందాలన్నారు. కనుపర్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పార్కింగ్ వసతి కల్పించామన్నారు. అక్కడి నుంచి ప్రియదర్శిని కళాశాలకు ప్రత్యేక మినీ బస్సుల సౌకర్యం కల్పించామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ శర్మద, ఏఆర్‌ఓలు వెంకటేశ్వరరావు, దేవీకుమారి, వెంకటరమణ, ఎన్నికల డీటీ మాధవి, స్వర్ణ, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాకథాన్

నెల్లూరు(అర్బన్): ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని వాకథాన్ ర్యాలీని నారాయణ స్పెషాల్టీ ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగాధిపతి చంద్రబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. రక్తపోటు రాకుండా అవగాహన పెంచుకొని ముందస్తు జాగ్రత్తలను పాటించాలని కోరారు. డాక్టర్లు ప్రభాకర్‌రాజు, అరుణ్‌కాంత్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ వనజకుమారి, ఆస్పత్రి ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్య సంస్మరణోత్సవాలు

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదిశంకరాచార్య సంస్మరణోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తిరుపతి కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఓరుగంటి శ్రీరామలాలశర్మ ప్రవచించారు. తొలుత శంకరభగవత్పాదుల వారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, లక్ష్మీనృసింహస్వామికి లక్ష్మీనరసింహ అష్టోత్తర, శతనామస్తోత్ర పారాయణం, పుష్పార్చనలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సభాపోషకుడిగా చక్రాల ఆనంద్‌కుమార్ వ్యవహరించారు. ట్రస్ట్ మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం, రాకేష్ చౌదరి, సరళ చౌదరి, కోటేశ్వరరావు, కోట రాజశేఖర్, ఫణిరత్నం, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, సురేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

‘డీకేడబ్ల్యూ’లో అడ్మిషన్లు ప్రారంభం



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లను ప్రారంభించామని ఆర్ఐఓ, ప్రిన్సిపల్ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. ఇంటర్‌లో తొలి అడ్మిషన్ పొందిన విద్యార్థినిని బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య అభినందించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడారు. జనరల్ విభాగంలో తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు.. తెలుగు మీడియంలో హెచ్ఈసీ.. ఒకేషనల్ విభాగంలో బీఆర్‌ఎం, సీజీటీ, సీఎస్ఈ, ఎమ్మెల్టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. దూర ప్రాంత విద్యార్థినుల కోసం కళాశాలలో హాస్టల్ సౌకర్యం ఉందని, అడ్మిషన్లు, ఇతర వివరాల కోసం 0861 – 2337889 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

నెల్లూరు(బారకాసు): పర్యావరణాన్ని పరిరక్షించడం బాధ్యత కావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ పేర్కొన్నారు. నరసింహస్వామి జయంతిని పురస్కరించుకొని పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలను బుధవారం నాటారు. నేతలు కీపూడిబాబు, అలిమేలు శ్రీను, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, కార్తీక్, పెంచలయ్య, చెంగయ్య, శివ, నాగేంద్ర, ఖాదర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎడగారుకు సన్నద్ధం

• పెన్నార్ డెల్టాలో వరినాట్లు

పొదలకూరు: మండలంలోని పెన్నార్ డెల్టా పల్లెల్లో ఎడగారు సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. మండలంలో పంటల సాగు ప్రత్యేకంగా ఉంటుంది. మొత్తం 30 పంచాయతీలకు గానూ కేవలం ఆరింట్లోనే ఎడగారు పంటలను అధికంగా సాగు చేస్తారు. మిగిలిన 26 పంచాయతీల్లో ఒక కారు పంటలను మాత్రమే పండిస్తారు. సూరాయపాళెం, విరువూరు, వెలికంటిపాళెం, నేదురుమల్లి, మహ్మదాపురం, తాటిపర్తి పంచాయతీలు పెన్నార్ డెల్టా ప్రాంతాలు కావడంతో ఏడాదికి రెండు పంటలు పండుతున్నాయి. ఈ పంచాయతీల్లో ఎడగారు కింద 2500 ఎకరాల్లో నాట్లు వేస్తుంటారు. అయితే ఈ ఏడాది రెండు వేల ఎకరాల్లోనే నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. నార్లు పోసి 15 ఎకరాల్లో నాట్లు కూడా వేశారు. ఈ గ్రామాల్లో ఎక్కడ బోర్లు వేసినా నీరు పడుతుంది. బోర్లు వేసేందుకు యంత్రాలను రైతులు ఉపయోగించరు.

సాగు కొంత తగ్గే అవకాశం

కొందరు రైతులు మాత్రం వేసవిలో కురిసే వర్షాలకు నువ్వు పంటలను సాగు చేస్తుంటారు. భూగర్భ జలాలు పెరగడంతో ఎడగారు సాగులో సాగునీటికి ఇబ్బందులు తలెత్తవని రైతులు తెలిపారు. పత్తి సాగు చేస్తున్న తరుణంలో ఎడగారు వరిసాగు కొంత మేర తగ్గే అవకాశం ఉంది. పత్తి పంట మూడు దఫాలుగా దిగుబడి ఉంటుంది. జూలై, ఆగస్టులో పత్తి దిగుబడి కానున్న నేపథ్యంలో ఎడగారు కింద వరి సాగును తగ్గించుకున్నామని రైతులు చెప్పారు. మరోవైపు ఎడగారులో వరి దిగుబడి తగ్గుతుండటంతో పత్తి సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఎడగారులో బోర్ల కిందే వరినాట్లను దాదాపుగా వేస్తారని ఏఓ గీతాకుమారి తెలిపారు.



నార్ల కట్టలు కడుతున్న కూలీలు



సేద్యం పనులను పూర్తి చేసి నాట్లకు సిద్ధంగా ఉన్న పొలం

సేంద్రియ ఎరువులే శ్రేయస్కరం

తోటపల్లిగూడూరు: వ్యవసాయంలో అధిక దిగుబడులను సాధించాలంటే సేంద్రియ ఎరువులే శ్రేయస్కరమని మండల వ్యవసాయాధికారి శిరీషారాణి పేర్కొన్నారు. సమగ్ర పోషణ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని పేడూరు, ఇస్కపాళెం రైతు భరోసా కేంద్రాల పరిధిలో వ్యవసాయాధికారులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యవసాయంలో ఎరువుల ఎంపిక అత్యంత కీలకమని చెప్పారు. సాగుకు ముందుగా మట్టి పరీక్షలను చేయించుకొని దానికనుగుణంగా మంచి ఎరువులను ఎంచుకోవాలని కోరారు. భూసారానికి హాని కలిగించే రసాయన ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ వ్యవసాయ విస్తరణాధికారి హరిబాబు, వ్యవసాయ గ్రామ సహాయకులు షర్మిల తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

పొదలకూరు: పెంచలకోన బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని శ్రీనివాస లేఅవుట్, జమునా థియేటర్ సెంటర్ యువకులు బుధవారం ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించిన అనంతరం పంచాయతీ ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, చౌప్పా వెంకటేశ్వర్లు, కొమ్మి వేణుగోపాల్, నర్ల వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోటార్లు, స్టార్టర్ల ధ్వంసం

విడవలూరు: మండలంలోని ముస్లారెడ్డిగుంటలో చేపల గుంటల సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బాధితుడు సత్యవోలు సత్యంరెడ్డి వివరాల మేరకు.. గ్రామంలో నాలుగెకరాల్లో చేపల గుంటలను మూడేళ్లుగా సాగుచేస్తున్నానని చెప్పారు. గుంటల వద్ద కాపలా ఉంటున్న వ్యక్తి సెలవుపై ఊరెళ్లారని, దీంతో మోటార్లు, స్టార్టర్లు, కరెంట్ వైర్లు, పైపులను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని చెప్పారు. దాదాపు రూ.లక్ష నష్టం సంభవించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.



నిమ్మ చెట్లు దగ్ధం

పొదలకూరు: మండలంలోని నావూరుపల్లిలో అగ్ని ప్రమాదం సంభవించి నిమ్మ, మామిడి, టేకు చెట్లు బుధవారం దగ్ధమయ్యాయి. బాధితురాలు పిల్లపాక ఆదెమ్మ కథనం మేరకు.. తోట సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు పడి తోట కట్టవ దగ్ధమైందని చెప్పారు. దీంతో సమీపంలోనే ఉన్న నిమ్మ, మామిడి, టేకు చెట్లు దగ్ధమయ్యాయి. కాలనీ వాసులు గుర్తించి తోటంతా మంటలు వ్యాపించకుండా ఆర్పేశారు.



బాబోయ్ కుక్కలు..!



తోటపల్లిగూడూరు: మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద అధికమైంది. మండలంలోని 22 పంచాయతీల్లో గల 74 మజరా గ్రామాల్లో వేల సంఖ్యలో ఉన్న కుక్కలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇవి దాడి చేస్తుండటంతో పలువురు గాయపడుతున్నారు. మండలంలోని చిన్నచెరుకూరు, కొత్తపాళెం, కోడూరు, మండపం, వరిగొండ, ఈదూరు, సాలిపేట, నరుకూరు, తోటపల్లిగూడూరు గ్రామాల్లో గడిచిన నెల్లో దాదాపు 25 మందికిపైగా కుక్క కాటుకు గురయ్యారు. కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నందివాహనంపై కాశీవిశ్వనాథుడు



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. స్వామివారికి అభిషేకాలు, పూజలను దేవస్థాన ప్రధానార్చకులు వందవాసి విశ్వనాథ గురుకుల్, వందవాసి గణేష్ గురుకుల్ ఆధ్వర్యంలో జరిపారు. గిన్నెభిక్ష, నందివాహన సేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా బైసాని నాగరాజు, దేవసేన, వేమూరి కిశోర్‌కుమార్, అరుణలత దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.

వేదగిరిలో కనులపండువగా కల్యాణం

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పూలంగిసేవ, కల్యాణోత్సవం, గజవాహన సేవను నేత్రపర్వంగా బుధవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా ములుమూడి హైమావతమ్మ, పల్లంరెడ్డి గోపాల్‌రెడ్డి కుమారులు, బండి లచ్చారెడ్డి కుమారులు తదితరులు వ్యవహరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈఓ గిరికృష్ణ, దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి

నెల్లూరు(బృందావనం): తాళ్లపాక అన్నమాచార్యులు జయంతిని నగరంలోని నర్తకి సెంటర్‌లో కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తొలుత అన్నమాచార్యులు చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా గాయకుడు పాటూరు శ్రీనివాసులును సత్కరించారు. జయప్రకాష్, మురళీమోహన్‌రావు, రాధాకృష్ణ, మహేష్, సత్యం, శీనయ్య, ప్రసాద్, ఆనంద్, షఫీ, మారి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా బంగారు గరుడసేవ



నెల్లూరు(బృందావనం): నృసింహ జయంతిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బంగారు గరుడసేవను వేడుకగా బుధవారం నిర్వహించారు. తిరుమంజనం, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. విశేష పుష్పాలంకారంలో కొలువైన రంగడ్ని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తగా రాజా హజరత్ బాబు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు

ఇందుకూరుపేట: మండలంలోని ఇందుకూరుపేటలో కొలువైన లక్ష్మీనృసింహుడికి విశేష పూజలను బుధవారం నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చనను జరిపారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీనరసింహస్వామికి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆత్మకూరు గోవర్ధన్, ఆత్మకూరు శ్రీనివాసులు వ్యవహరించారు. పల్లకిసేవను జరిపారు. నందకిశోర్, నరేష్, నారాయణాచార్యులు పాల్గొన్నారు.



వేడుకగా నందిసేవ

ఇందుకూరుపేట: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామికి నందిసేవను వేడుకగా బుధవారం నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. కొబ్బరికాయలు, పండ్లు, కర్పూర హారుతులను భక్తులు సమర్పించారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉభయకర్తగా తోటపల్లి వేణుగోపాల్‌రెడ్డి వ్యవహరించారు. కాగా స్వామివారి కల్యాణోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ కనుపూరు సురేంద్రబాబు తెలిపారు.



ఘనంగా లక్ష్మీనృసింహుడి గ్రామోత్సవం

మనుబోలు: నృసింహస్వామి జయంతి వేడుకలను పురస్కరించుకొని మండలంలోని లక్ష్మీనరసింహపురంలో గ్రామోత్సవాన్ని వేడుకగా మంగళవారం రాత్రి నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేకాలంకారాన్ని అర్చకుడు వెంకటనాగ మునుస్వామి ఆధ్వర్యంలో జరిపారు. భక్తులు విశేషంగా హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు. గ్రామోత్సవంలో కొబ్బరికాయలు, పూలు, పండ్లను భక్తులు సమర్పించి స్వామివారికి మంగళహారతులు పట్టారు.



కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు



కొడవలూరు: వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి రాజేశ్వరి కోరారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కొడవలూరులోని గ్రంథాలయంలో విద్యార్థులతో నీతి కథలు చెప్పించడం, చిత్రలేఖనం తదితరాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శిబిరాలను వచ్చే నెల ఏడు వరకు నిర్వహించనున్నామని వెల్లడించారు.

జీవ ఎరువులను విరివిగా వినియోగించాలి



విడవలూరు: పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



కొడవలూరు: అవగాహన కల్పిస్తున్న లక్ష్మి

కొడవలూరు: జీవ సంబంధమైన ఎరువులను వాడటం ద్వారా భూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని ఏఓ లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కొడవలూరు, గుండాలమ్మపాళెంలో భూసార పరిరక్షణపై రైతులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పచ్చిరొట్ట పైర్లు పొలంలో దమ్ము చేసుకోవడం ద్వారా పైరుకు అవసరమైన సేంద్రియ పదార్థాలు అందుతాయని తెలిపారు. మట్టి నమూనా పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను ఉపయోగించడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. అనంతరం నానో యూరియా, నానో డీఏపీ ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ అనూష, వీఏఏలు విష్ణుప్రియ, శివజ్ఞాన, పంచాయతీ కార్యదర్శి అంకమరాణి, వీఆర్వో రఘు తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: ఎరువుల వాడకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య పేర్కొన్నారు. ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని వావిళ్ల, గాదెలదిన్నె గ్రామాల్లో గల రైతు భరోసా కేంద్రాల వద్ద నిర్వహించారు. అనంతరం వావిళ్లలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. వీఏఏలు శరణ్‌బాబు, పూజిత, వీఆర్వో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: భూసార పరీక్షలను రైతులు తప్పక చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్ర ఏడీ మారుతీదేవి కోరారు. భూసార పరిరక్షణపై మండలంలోని పాటూరు, చెర్లోపాళెం గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం నానో డీఏపీ కలిపిన యూరియాను వరి పొలంలో డెమో ద్వారా వివరించారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్ర అధికారి శైలజకుమారి, ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏఓ ఇందిరావతి, అనూష తదితరులు పాల్గొన్నారు.



కోవూరులో..

28 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థాన ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 28 నుంచి జూన్ మూడు వరకు అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను దేవస్థాన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో వేగంగా చేస్తున్నారు.

దాతల సహకారంతో సుమారు రూ.నాలుగు కోట్లతో దేవస్థానాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. 28న సాయంత్రం అంకురార్పణ, 29న ధ్వజారోహణ, శేషవాహన సేవ, 30న సూర్యప్రభ వాహనసేవ, హనుమంత వాహనసేవ, 31న కల్యాణం, గజవాహన సేవ, జూన్ ఒకటిన కల్పవృక్ష వాహనసేవ, అశ్వవాహన సేవ, రెండున చక్రతీర్థం, పుష్పయాగం, మూడున 101 కలశాలతో అభిషేకం జరగనుంది.